క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



వాకతిప్పలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ సూచించారు. మండలంలోని వాకతిప్పలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు రూ.30 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, మాస్టర్ వీవర్ లొల్ల వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే దొరబాబు



నరేంద్ర భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన ఉమ్మిడి నరేంద్ర గత కొంతకాలంగా బోన్‌మెరో వ్యాధితో బాధ పడుతున్నాడు. నరేంద్ర ఆరోగ్య పరిస్థితిని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి నరేంద్రకు తాత్కాలిక చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నరేంద్ర ఆరోగ్య పరిస్థితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నరేంద్ర చికిత్సకు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరేంద్ర ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి పాలాని దొరబాబు, కొత్తపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సానా నాగు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

సామర్లకోట: పింఛను లబ్ధిదారులు ఇళ్ల వద్ద లేకపోతే వారి చిరునామాలు సేకరించి అక్కడకు వెళ్లి వలంటీర్లు పింఛన్ల మొత్తం అందజేస్తున్నారు. అచ్చంపేటకు చెందిన పింఛను లబ్ధిదారుడు బొత్తుల పద్మారావు కాకినాడ జీజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ కుంచే వీరబాబు గురువారం జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేశాడు.

కాపు కల్యాణ మండపానికి మరమ్మతులు చేయించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన కాపవరపు కుమార్ తదితరులు

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కాపు కల్యాణ మండపానికి మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకురావాలని ఆల్ ఇండియా మాదిగ డెవలప్‌మెంట్ సమాఖ్య అధ్యక్షుడు కాపవరపు కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతి పత్రం అందజేశారు. కాపు కల్యాణ మండపం కంపోస్టు యార్డుగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాపు నాయకుడు అడబాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా 'సురక్ష'

- మండల, మున్సిపాలిటీల్లో చురుగ్గా వైద్య శిబిరాలు
- 8,100 మందికి పరీక్షలు
- పది మందికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు



రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఆవాల రాజేశ్వరి, గంగిరెడ్డి అరుణ తదితరులు

సామర్లకోట: సామాన్యులకు ఉన్నత వైద్యమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అపూర్వ స్పందన లభిస్తోంది. మండల పరిధి 18 గ్రామాలలో 22 శిబిరాలు నిర్వహించగా, మున్సిపాలిటీ పరిధిలో ఇంకా కొనసాగుతున్నారు. గురువారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వార్డు కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శుక్రవారం గాంధీచౌక్‌లోని రైతు భవనంలోను, శనివారం తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో, 6న వైఏఎంహెచ్ స్కూల్‌లో నిర్వహించే వైద్య శిబిరాలతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయి. రోగులకు అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు, పరీక్షల రిపోర్టులను సైతం అందిస్తున్నారు. మెరుగైన చికిత్స అవసరమైతే ఆరోగ్యమిత్ర బంగారుశ్రీ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటికి 10 మందిని గుర్తించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందించారు. ఇప్పటి వరకు పట్టణ మండల పరిధిలో 8,100 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ఆవాల రాజేశ్వరి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉటుందని ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా కార్యక్రమాన్ని రూపొందించిన ముఖ్యమంత్రి జగన్‌ను జీవిత కాలం ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. వైద్యులు జ్యోతి, సంజీవ్, తిరుమలాదేవి, మండలంలో పి.ప్రశాంత్, శ్రీహిమవతి వైద్య సేవలందిస్తున్నారు.

ఊహించని విధంగా వైద్య సేవలు



ప్రజల వద్దనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని ఊహించలేదు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటి వచ్చి తమ ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, ఆరోగ్య సురక్ష శిబిరాలకు రావాలని చెప్పారు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఇచ్చి సూచనలిచ్చారు. – కొమ్ము పెంటమ్మ, సామర్లకోట

ఇంటి వద్దకే వైద్యం



రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి వెళ్లలేక పోయేదాన్ని. ఇంటి వద్దకే వైద్య సేవలు రావడం ఆనందంగా ఉంది. అన్ని పరీక్షలు చేసి మందులు రాసిచ్చారు.

– లంకా మహాలక్ష్మణుడు, సామర్లకోట

మంచి స్పందన



మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న సురక్ష శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రతి శిబిరంలో 400కు మించి రోగులు వస్తున్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రికి తరలించడానికి ఆరోగ్య మిత్ర అందుబాటులో ఉన్నారు.

– డాక్టర్ జ్యోతి, సామర్లకోట

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే దొరబాబుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న నిర్వాహకులు

పిఠాపురం: స్థానిక ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వోన్నత పాఠశాలలో ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు హాజరు కావాలని నిర్వాహకులు ఎమ్మెల్యే పెండెం దొరబాబును కోరారు. ఈ మేరకు గురువారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడా కారులకు ఎమ్మెల్యే వసతి, భోజన సౌకర్యాలను కల్పించనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రాపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



రాపర్తిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని రాపర్తిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, పచ్చ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అవినీతిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబు నాయుడికు శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో సానుభూతిని పొందేందుకు టీడీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఉప్పాడ చేనేత సంఘానికి పురస్కారం అభినందనీయం

కలెక్టర్ కృతికా శుక్లా



లెఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును కలెక్టర్‌కు అందజేస్తున్న చేనేత, జౌళిశాఖ అధికారులు



పిఠాపురంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ఎమ్మెల్యే దొరబాబుకు చూపిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: 2023 సంవత్సరానికి ఉప్పాడ చేనేత సహకార సంఘానికి డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కడం అభినందనీయమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాకు గౌరవ సూచకంగా జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, ఇతర సిబ్బంది ఈ అవార్డును అందించారు. ఉప్పాడ చేనేత సహకార సంఘం సభ్యులను, జిల్లా చేనేత, జౌళి అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1938లో ప్రారంభమైన సంఘం 85 ఏళ్లుగా చేనేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తోందన్నారు. ఉప్పాడ జాన్దానీ చీరలకు 2008లో జీఐ ట్యాగ్ గుర్తింపు పొందిందన్నారు. అవార్డు నగదును ఉప్పాడ చేనేత సొసైటీ అభివృద్ధికి వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

చేనేత సంఘాల అభివృద్ధికి కృషి

పిఠాపురం: చేనేత సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఉప్పాడ చేనేత సొసైటీకి వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. కాగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా చేనేత జౌళి శాఖ అధికారులు అవార్డు అందుకున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేను అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. అధికారులను ఎమ్మెల్యే అభినందించారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- భోగాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



భోగాపురంలో రోగులకు సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని భోగాపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ప్రజల చెంతకే వైద్యం



ఉప్పాడలో రోగలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుష్మ



మంచానికే పరిమితమైన వృద్ధురాలికి వైద్యం చేస్తున్న డాక్టర్, సిబ్బంది

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ అన్నారు. మండలంలోని ఉప్పాడలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మ మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం కోసం వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులను సకాలంలో తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫుడ్ కమిషన్ తనిఖీలు



సామర్లకోట గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్టాక్‌ను పరిశీలిస్తున్న కిరణ్

సామర్లకోట/పెద్దాపురం: పట్టణ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలు, హాస్టళ్లను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ గురువారం తనిఖీ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోందన్న ఫిర్యాదుల మేరకు రేషన్ డిపోలతో పాటు బియ్యం సరఫరా చేసే వాహనాలను, పాఠశాలలోను, అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పెద్దాపురం మండలం కట్టమూరు జెడ్పీ హైస్కూల్‌లో బియ్యం బ్యాగ్ తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచరు పనితీరును గుర్తించి ఆమెను సత్కరించినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేసి రికార్డుల నిర్వహణ, నిల్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్నారుల హాజరు వివరాలు పరిశీలించారు. పెద్దాపురం సీహెచ్‌సీని తనిఖీ చేయగా భోజనాలను ప్లాస్టిక్ కవర్లలో పెడుతున్నట్లు గుర్తించామని, దానిని బయట హోటల్ భోజనంగా గుర్తించామన్నారు. ఈ మేరకు లోపాలు ఉంటే ఆయా శాఖల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేలా అధికారులకు సిపార్సులు చేయనున్నట్టు తెలిపారు. సామర్లకోట గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొందరు విద్యార్థులు సాంబరు నాసిరకంగా ఉంటోందని ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లో సాయంత్రం భోజనాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లో ఉండాల్సిన స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సామర్లకోటలో బీసీ, ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన పాఠశాల వార్డెన్ ఎ.లచ్చన్న తదితరులు ఆయన వెంట పాల్గొనగా, పెద్దాపురంలో ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, సీడీపీఓ ఉష, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

జీజీహెచ్‌లో నేలకొరిగిన భారీ వృక్షం



నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఓ భారీ వృక్షం నేలకొరిగింది. ఐదాకుల చెట్టుగా పిలిచే ఈ వృక్షం మెడికల్ భవంతి నుంచి సర్జికల్‌కి వెళ్లే మార్గంలో ఎడమ వైపు ఉంటుంది. త్వరగా ఎత్తు పెరగడం ఈ చెట్టు లక్షణం. ఎత్తు ఎదగడంతో పాటు వేళ్లు డ్రైనేజీ లోపలికి వెళ్లడం వల్ల బలహీనపడి గురువారం వీచిన గాలులకు చెట్టు నేలకొరిగింది. ఓ కారుపై పడడంతో వాహనం పాక్షికంగా దెబ్బతింది. సాలిపేట ఫైర్ ఆఫీసర్ ఉద్దండరావు సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల రెస్క్యూ బృందం గంటకు పైగా శ్రమించి చెట్టును కత్తిరించి తొలగించారు. అప్పటి వరకు ఓపీ కోసం వెళ్తున్న రోగులు ఇబ్బంది పడ్డారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సామర్లకోట: ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం కావడంతో మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంఏఓ కీర్తి గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

మోటార్ల పరిశీలన



జలకళ మోటార్లను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్వేత

పిఠాపురం: వైఎస్సార్ జలకళ పథకంలో రైతులకు మంజూరైన మోటార్లను గురువారం జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్వేత పరిశీలించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మోటార్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైఎస్సార్ జలకళ పథకంలో గొల్లప్రోలు మండలానికి 11, పిఠాపురం మండలానికి రెండె మోటార్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కొండలరావు, ఈసీ బాబ్జీ, జలకళ సీటీఏ వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పిఠాపురం: మండలంలోని నవఖండ్రవాడ గ్రామానికి చెందిన యాగంటి వినోద్ తన తల్లి నుంచి కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. వినోద్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును పిఠాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కామేశ్వరరావు, మాధవపురం సర్పంచ్ బండి సుబ్బులు, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై నేటి నుంచి జాతీయ సమావేశాలు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మత్స్యకారుల వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ ప్రధాన కార్యదర్శి పి.స్టాన్లీ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలపై పోరాడుతున్న ప్రతినిధులతో అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ సమావేశాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డిని కలసిన శాస్త్రి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి బుధవారం అమరావతిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డిని కలసి పెన్షనర్ల సమస్యలపై చర్చించినట్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం గురువారం తెలిపారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా కలసినట్లు పేర్కొన్నారు. సంఘం తరపున ఇచ్చిన విజ్ఞాపనపై జవహర్ రెడ్డి స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు.

ఉండూరులో సామూహిక కుంకుమ పూజలు



ఉండూరులో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు రామాలయంలో స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో గురువారం నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, సత్యనారాయణమూర్తి, అల్లికి రాజాల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గ్రామంలోని అనేక మంది మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం గొంచాలలోను, 4న కాపవరంలోను, 5న వేట్లపాలెంలోను, ఆరున హుస్సేన్‌పురంలోను ఏడున వీకె రాయపురం గ్రామంలోను, 8న నవర గ్రామంలోను ధర్మ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ వివరించారు. ఈ మేరకు పారాయణలు, కుంకుమ పూజలు, భజనలు, కోలాటం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కోటి బిల్వార్చనకు చురుగ్గా ఏర్పాట్లు

- 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులతో పడిపూజ
- హాజరుకానున్న కేరళ పందల వంశీకులు



కోటి బిల్వార్చన ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో శివారు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎదురుగా 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో ఈ నెల 4న నిర్వహించే కోటి బిల్వార్చన, పడిపూజలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న కోటి బిల్వార్చనలో 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులు, మరో పది వేల మంది సాధారణ భక్తులు పాల్గొనేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటి బిల్వార్చనకు కేరళ శబరిమలై సన్నిధానం నుంచి పందల రాజుల వంశస్తులు, అయ్యప్పస్వామి ఆలయం ప్రధాన అర్చకులు మేల్ శాంతి, తిరు ఆభరణాలు తీసుకువెళ్లే స్వామి, చండా వాయిద్య కళాకారుల బృందం హాజరుకానుంది. మాలధారణ భక్తులకు మౌలిక వసతులు, ఫలహారం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. సదుపాయాల కల్పనలో స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోనున్నారు. బిల్వాలు, కొబ్బరి కాయకులు, పూలు, ఇతరేతర సేవలు అందిస్తున్నారు.

పూజా కార్యక్రమాలు

కోటి బిల్వార్చన, పడి పూజ సందర్భంగా శనివారం వివిధ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నాలుగు గంటలకు అష్టద్రవ్య లక్ష్మీగణపతి హోమం, ఎనిమిది గంటలకు దండపాణి గురుస్వామి జయంత్యోత్సవం సందర్భంగా కత్రాళ్ల కొండ అయ్యప్పస్వామి గుడి నుంచి సభస్థలం వరకు భక్తులతో ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి పడి పూజ, 5.30 గంటల నుంచి కోటి బిల్వార్చన ప్రారంభమవుతుంది. తుని, పాయకరావుపేట అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండపాణి గురుస్వామి పర్యవేక్షణలో కోటి బిల్వార్చన, పడి పూజ నిర్వహించనున్నారు.